ధాన్యం దళారులకు విక్రయించొద్దు

● ఏడీఏ రాజ్‌నారాయణ

చిన్నశంకరంపేట(మెదక్): రైతులు ధాన్యం దళారులకు విక్రయించవద్దని రామాయంపేట ఏడీఏ రాజ్ నారాయణ కోరారు. గురువారం నార్సింగి మండల కేంద్రంలో వరి కోతకు సిద్ధంగా ఉన్న పంటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కోత సమయంలోనే తగు జాగ్రత్తలు తీసుకుంటే పొల్లురాకుండా ఉంటుందని చెప్పారు. రైతులు కనీస నాణ్యత ప్రమాణాలు పాటించినట్లయితే మద్దతు ధరను పొందేందుకు అవకాశం ఉందన్నారు. ధాన్యం కొనుగోలు కోసం అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. సన్నరకం కొనుగోలుకు విడిగా ధాన్యం కాంటా చేయడంతో పాటు రూ.500 బోనస్ అందించనున్నట్లు తెలిపారు. ఆయన వెంట నార్సింగి ఏఓ యాదగిరి ఉన్నారు.



వరి పంటను పరిశీలిస్తున్న ఏడీఏ రాజ్ నారాయణ

కొనుగోలు వేగవంతం చేయాలి

నర్సాపూర్ రూరల్: ధాన్యం కొనుగోలును వేగవంతం చేయాలని నర్సాపూర్ తహసీల్దార్ శ్రీనివాస్ సూచించారు. గురువారం మండలంలోని తుజాల్‌పూర్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. రైతులకు ఇబ్బందులు లేకుండా నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ ధాన్యం కొనుగోలు చేయాలని చెప్పారు. కాగా, మండలంలోని లింగాపూర్‌లో కొనసాగుతున్న కులగణన సర్వేను తహసీల్దార్ శ్రీనివాస్ పరిశీలించారు. కులగణన కోసం వచ్చే అధికారులకు సహకరించాలని కోరారు.



లింగాపూర్ లో సర్వేను పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్

లక్ష్యం మేరకు మొక్కలు పెంచాలి

● ఎంపీడీఓ శ్రీనివాస్

కౌడిపల్లి(నర్సాపూర్): గ్రామ నర్సరీలలో లక్ష్యం మేరకు మొక్కలు పెంచాలని ఎంపీడీఓ శ్రీనివాస్ తెలిపారు. గురువారం మండలంలోని వెల్మకన్నలో నర్సరీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పంచాయతీలోని నర్సరీలలో 5వేల మొక్కలు పెంచాలన్నారు. వచ్చే వనమహోత్సవానికి మొక్కలు సిద్ధం అయ్యేలా చూడాలన్నారు. గ్రామంలో నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలని తెలిపారు. పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

అసైన్డ్ భూముల కొనుగోలుపై విచారణ



సూరారంలో అసైన్డ్ భూములను పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

చిన్నశంకరంపేట(మెదక్): ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఆదేశాలతో చిన్నశంకరంపేట మండలం సూరారం రెవెన్యూ పరిధిలోని భాగిరథపల్లి అసైన్డ్ భూములను రెవెన్యూ అధికారులు గురువారం పరిశీలించారు. మండలంలోని సూరారం గ్రామ శివారులోని దళితులకు ప్రభుత్వం కేటాయించిన అసైన్డ్ భూములను సంపత్‌రావు రియల్టర్ కొనుగోలు చేసి వ్యాపారం నిర్వహిస్తున్నాడని గ్రామానికి చెందిన దుర్గపతి కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో చిన్నశంకరంపేట ఆర్ఐ రాజు, సర్వేయర్ గంగాభవాణి అసైన్డ్ భూములను పరిశీలించారు. తుది నివేదికను కమిషన్‌కు అందించనున్నట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.

బడిని బాగు చేసుకుందాం

● యూపీఎల్ పరిశ్రమ సాయంతో పాఠశాలలో మరమ్మతులు

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని కాళ్ళకల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మరమ్మతు పనులను గ్రామ శివారులోని యూపీఎల్ అడ్వాంటా విత్తనాల పరిశ్రమ ప్రతినిధులు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సప్లయ్ చైన్ హెడ్ వీసీ త్రిపాఠి మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాల సమస్యలకు తమ పరిశ్రమ సీఎస్ఆర్ నిధుల నుంచి రూ.22 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. మరమ్మతు పనులు, కిచెన్ షెడ్, కాంపౌండ్ వాల్, గ్రిల్స్, విద్యార్థులకు స్పోర్ట్స్ మెటీరియల్ అందిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నత్తి మల్లేష్, హెచ్ఎం నర్సింగం, పరిశ్రమ సీఎస్ఆర్ లీడ్ రేణిత, అడ్మిన్ జయంత్, సేఫ్టీ సతీష్, పరమేశ్, సుమంత్, తదితరులు పాల్గొన్నారు.



పనులు ప్రారంభిస్తున్న పరిశ్రమ ప్రతినిధులు, తదితరులు

రెండు వేల మందికి దుస్తుల పంపిణీ

రేపు ఘనంగా సీఎం రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట)/సిద్దిపేటకమాన్/గజ్వేల్ రూరల్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించనున్నట్లు టీపీసీసీ సభ్యుడు దరిపల్లి చంద్రం, 37వ వార్డు కౌన్సిలర్ సాకిబాల్ లక్ష్మీ తెలిపారు. జిల్లా కేంద్రంలో గురువారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. రెండు వేల మంది పేదలు, పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మైనంపల్లి హన్మంతారావు హాజరుకానున్నారని, మధ్యాహ్నం ఒంటి గంటకు అంబేడ్కర్ చౌరస్తా నుంచి యాక్సిస్ బ్యాంక్ చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కౌన్సిలర్‌లు రియాజుద్దీన్, ఎల్లం యాదవ్, అత్తు ఇమామ్, గయాజొద్దీన్, మధు, నజ్జు, అనిల్ తదితరులు పాల్గొన్నారు. సీఎం జన్మదినం సందర్భంగా గజ్వేల్‌కు చెందిన రామకోటి భక్తసమాజం వ్యవస్థాపక అధ్యక్షుడు రామకోటి రామరాజు ఆవాలతో సీఎం రేవంత్‌రెడ్డి రూపాన్ని చిత్రీకరించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ సర్దార్‌ఖాన్ మాట్లాడారు. రాములు, సాదిక్‌పాష, బాలు, సురేశ్ పాల్గొన్నారు.



గజ్వేల్‌రూరల్: ఆవాలతో రేవంత్‌రెడ్డి చిత్రపటం

విద్యార్థులకు చెకుముకి పోటీలు



ప్రశ్నపత్రాలను అందజేస్తున్న బాలరాజు, మల్లారెడ్డి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట)/గజ్వేల్‌రూరల్: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలో పాఠశాల స్థాయిలో చెకుముకి పోటీలు నిర్వహించారు. కాకతీయ టెక్నో హైస్కూల్లో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర జన విజ్ఞాన వేదిక కమిటీ సభ్యుడు ములుగు బాలరాజు, ట్రస్మా స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్, టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి జగ్గు మల్లారెడ్డి హాజరయ్యారు. విద్యార్థుల్లో శాస్త్రీయ అవగాహన పెంచడానికి ఈ పోటీలు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కవిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. జేవీవీ ఆధ్వర్యంలో సమగ్ర శిక్ష సహకారంతో గజ్వేల్ మండల వ్యాప్తంగా జరిగిన చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో 8, 9, 10వ తరగతుల నుంచి మొత్తం 3వేల మంది విద్యార్థులు పాల్గొన్నట్లు జేవీవీ జిల్లా గౌరవాధ్యక్షుడు నర్సింహులు తెలిపారు. 21న జరిగే మండల స్థాయి టాలెంట్ టెస్ట్‌కు హాజరు కావాలని సూచించారు.

మూడు రోజుల్లో పరిష్కరించండి



మాట్లాడుతున్న మల్లారెడ్డి

అదనపు డీసీపీ మల్లారెడ్డి

సిద్దిపేటకమాన్: దరఖాస్తును మూడు రోజుల కంటే ఎక్కువ పెండింగ్ పెట్టవద్దని అదనపు డీసీపీ మల్లారెడ్డి ఆదేశించారు. 2.0 నూతన అప్లికేషన్‌పై సిబ్బందికి గురువారం ఒక రోజు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పీఎస్‌కు వచ్చే ప్రతి దరఖాస్తుకు రసీదు ఇవ్వాలన్నారు. మూడు రోజుల్లో దరఖాస్తును పూర్తి చేయాలని సూచించారు. పీఎస్‌కు వచ్చే ఫిర్యాదుదారులను గౌరవించాలని, ఐటీ కోర్ సీఐ శ్రీధర్‌గౌడ్ 2.0 నూతన వెర్షన్‌పై పవర్ పాయింట్ ప్రెజంటేషన్ ద్వారా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది శ్రీకాంత్, రాజిరెడ్డి, స్వామి, రమేశ్, స్వప్న, హరి తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై దృష్టి సారించండి

● డీఎల్పీఓ అనిత

కంది (సంగారెడ్డి): గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించకుండా చూడాలని డీఎల్పీఓ అనిత ఆదేశించారు. గురువారం మండలంలోని చిమ్నాపూర్‌లో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులు రాకుండా ఉండేందుకు ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతపై దృష్టి సారించాలన్నారు. పరిశుభ్రతపై పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గుంతల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. ప్రతి నెల వాటర్ ట్యాంకులను కడిగి శుభ్రం చేయాలని సూచించారు. పాత టైర్లు, పూల కుండీల్లో నిలిచే నీటితో దోమలు ఎక్కువై ప్రజలు రోగాల బారిన పడే అవకాశం ఉంటుందని తెలిపారు. తడి, పొడి చెత్తను వేరు చేసి ఇచ్చేలా ప్రజలకు పంచాయతీ సిబ్బంది చెప్పాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ మహేందర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

కొనసాగుతున్న సమగ్ర సర్వే

మనోహరాబాద్(తూప్రాన్): గ్రామాలలో సమగ్ర సర్వే కొనసాగుతోందని ఎంపీడీఓ వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం మండలంలోని పర్కిబండలో సర్వే జరుగుతున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్యుమరేటర్లకు పలు సూచనలు చేశారు. వీరి వెంట ఎంపీఓ లక్ష్మీ నర్సయ్య, కార్యదర్శి నాగరాజుగౌడ్ తదితరులు ఉన్నారు.

కల్లు దుకాణంపై కేసు నమోదు

రామాయంపేట(మెదక్): కల్లు సీసాలో బొద్దింకలు వచ్చిన ఘటనలో మండలంలోని కాట్రియాల గ్రామంలోని కల్లు దుకాణంపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ ఎస్ఐ విజయ్ సిద్దార్ధ తెలిపారు. ఈ మేరకు గురువారం బాధితులతో మాట్లాడారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

విద్యుత్ చౌర్యం కేసులో ఒకరి రిమాండ్

మనోహరాబాద్(తూప్రాన్): విద్యుత్ చౌర్యం కేసు లో కోర్టు సమన్లకు స్పందించకపోవడంతో ఒకరు రిమాండ్‌ైనట్లు విద్యుత్ అధికారి గురువారం ఓ ప్రక టనలో తెలిపారు. విద్యుత్ ఎస్ఐ వెంకటేశ్ కథనం మేరకు.. డీఈ, మెదక్ స్క్వాడ్‌తో కలిసి విజిలెన్స్, ఏపీటీఎస్ బృందం విద్యుత్ అధికారుల స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా మనోహరాబాద్ మండలంలోని దండుపల్లికి చెందిన సంపత్ శ్రావణ్‌కుమార్ బార్బర్ షాపులో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ చౌర్యానికి గురవుతున్నట్లు గుర్తించారు. దీంతో కేసు నమోదు చేసి జరిమానా విధించారు. ఈ విషయంలో న్యాయం స్థానం సమన్లు జారీ చేసినా నిందితుడు పట్టించుకోలేదు. కోర్టు ఉత్తర్వుల మేరకు జారీ చేసిన నాన్ బెయిలబుల్‌ను అమలు చేసి నిందితుడిని గురువారం ఫస్ట్ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి ఎదుట హాజరుపర్చినట్లు తెలిపారు.

448 దరఖాస్తులు

కౌడిపల్లి(నర్సాపూర్): పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటు హక్కు కోసం మండలంలో 448 దరఖాస్తులు వచ్చినట్లు డిప్యూటీ తహసీల్దార్ మహ్మద్ జహీర్ తెలిపారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు హక్కుకోసం 436, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటు హక్కుకోసం 12 దరఖాస్తులు వచ్చినట్లు చెప్పారు. త్వరలో ఓటరు జాబితా ప్రదర్శించనున్నట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ మృతి

మిరుదొడ్డి(దుబ్బాక): చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎస్ఐ బోయిని పరశురాములు కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన గున్నాల కనకరాజు(40) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గత 6న మండల పరిధిలోని చెప్యాల గ్రామంలో ఉంటున్న తన చెల్లెలికి బంధువుల పెండ్లి పత్రిక ఇచ్చి బైకుపై తిరుగు ప్రయాణమయ్యాడు. ఈ క్రమంలో మిరుదొడ్డి శివారులోని బొమ్మరాజు చెరువుకట్టపై అదుపు తప్పి కింద పడ్డాడు. దీంతో స్థానికులు అతడిని దుబ్బాక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు.

రోడ్డు ప్రమాదంలో గాయపడి..

సిద్దిపేటకమాన్: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు టూటౌన్ సీఐ ఉపేందర్ తెలిపారు. లింగారెడ్డి గ్రామ శివారులో రెండు రోజుల క్రితం ఆగి ఉన్న బస్సును తన బైకుతో ఢీ కొన్న ఘటనలో గాయపడిన గుర్తు తెలియని వ్యక్తి హైదరాబాద్ గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో గురువారం మృతి చెందినట్లు ఆయన చెప్పారు.

మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు కోర్టు జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ కథనం ప్రకారం పట్టణంలోని పలు ప్రాంతాలలో తమ సిబ్బందితో కలిసి నిర్వహించిన వాహన తనిఖీల్లో 9 మంది పట్టుబడ్డారు. కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రూ.14 వేల జరిమానా విధించారు.

అన్ని ఇళ్లకు స్టిక్కరు వేయాలి

● మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్

నర్సాపూర్: ప్రభుత్వం చేపట్టిన ఇంటింటి సర్వే కోసం పట్టణంలోని అన్ని ఇళ్లకు స్టిక్కర్లు వేయాలని మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ సూచించారు. గురువారం పట్టణంలో చేపట్టిన ఇంటింటి సర్వేలో భాగంగా స్టిక్కరింగ్ పనులను పరిశీలించారు. ఆయన పలు ఇళ్లకు స్టిక్కర్లు అతికించారు. అన్ని ఇళ్లను కవర్ చేయాలని ఆయన ఎన్యుమరేటర్లకు సూచించారు. కాగా పట్టణంలో గురువారం వరకు మూడు వేల ఇళ్లకు స్టిక్కర్లు వేసే పనులు పూర్తి అయ్యాయని మున్సిపల్ కమిషనర్ రామకృష్టారావు, మేనేజర్ మధుసూదన్ తెలిపారు.



నర్సాపూర్‌లో ఇంటికి స్టిక్కరు అతికిస్తున్న మున్సిపల్ చైర్మన్

తపాలా సేవలు సద్వినియోగం చేసుకోవాలి



పోస్టల్ పథకాల కార్డులు అందజేస్తున్న దృశ్యం

వెల్దుర్తి(తూప్రాన్): ప్రజల కోసం తపాలాశాఖ అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆ శాఖ ఇన్‌స్పెక్టర్ సందీప్ కులకర్ణి అన్నారు. మండల పరిధి హస్తల్పూర్ గ్రామంలో నూతనంగా తపాలా శాఖను ప్రారంభించారు. తపాలశాఖ ద్వారా ఉత్తరాల బట్వాడా, చిన్న మొత్తాల పొదుపు ఖాతాలు, రికవరింగ్ డిపాజిట్, సుకన్య, మహిళ సమ్మాన్ పథకం, పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ పథకాలతో ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో కార్యదర్శి శివ శంకర్, నాయకులు పాండురంగం, రమేష్, బాబు, విజయ్, కృష్ణ, బ్రాంచ్ పోస్టుమాస్టర్లు రఘురాములు, సృజన, తదితరులు ఉన్నారు.

సర్వేకు అందరి సహకారం అవసరం

ఎంపీడీఓ వెంకటేశ్వర్లు

కొండపాక(గజ్వేల్)/సిద్దిపేటకమాన్: సమగ్ర కుటుంబ సర్వేకు ప్రజలంతా సహకరించాలని ఎంపీడీఓ వెంకటేశ్వర్లు కోరారు. సిర్సనగండ్ల గ్రామంలో నిర్వహిస్తున్న సర్వేను గురువారం ఆయన పరిశీలించారు. ప్రతీ ఇంటికి స్టిక్కరువేసే కార్యక్రమంలో భాగంగా సిబ్బందితో ఇంటింటా తిరుగుతూ సర్వే గురించి ప్రజలకు వివరించారు. ప్రజల సందేహాలను నివృత్తి చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, ఉపాధి, రాజకీయ కులగణనలో తప్పులు లేకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో సర్వే సూపర్‌వైజర్ బాలకిషన్, పంచాయతీ కార్యదర్శి స్వప్న, ఎన్యూమరేటర్లు పాల్గొన్నారు. అదే విధంగా సిద్దిపేట 34, 35వ వార్డుల్లో ఇంటింటికి స్టిక్కర్లు అతికించే ప్రక్రియను మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఎన్యూమరేటర్లకు ప్రజలు సహకరించాలన్నారు. సర్వేను సకాలంలో పూర్తి చేయడానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సంధ్య శ్రీకాంత్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.



కొండపాక(గజ్వేల్): సర్వే గురించి వివరిస్తున్న ఎంపీడీఓ వెంకటేశ్వర్లు

ఆయిల్‌పామ్‌తో అధిక లాభాలు

జగదేవ్‌పూర్(గజ్వేల్): ఆయిల్‌పామ్ సాగులో సరైన మెలకువలు పాటిస్తే అధిక లాభాలు పొందొచ్చని మండల వ్యవసాయ అధికారి వసంతరావు అన్నారు. మండలంలోని చాట్లపల్లి గ్రామంలో ఆయిల్‌పామ్ పంటలను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంటనూనెల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించాలంటే ఆయిల్‌పామ్ సాగు ఒకటే పరిష్కారమన్నారు. నాలుగో సంవత్సరం దిగుబడి ప్రారంభమై 30 యేళ్ల వరకు ప్రతి నెల రెండు కోతలతో అధిక ఆదాయాన్ని పొందవచ్చిన తెలిపారు. పెట్టుబడి తక్కువ లాభాలు ఎక్కువ ఉంటాయని, అలాగే ప్రభుత్వం సబ్సిడీ అవకాశం ఇస్తోందని చెప్పారు. కార్యక్రమంలో హార్టికల్చరల్ అధికారి సౌమ్య, ఏఈఓలు విజయ్, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



పంటను పరిశీలిస్తున్న అధికారులు

మంత్రి కొండా సురేఖకి చిత్రపటం అందజేత



చిత్రపటాన్ని అందజేస్తున్న సతీశ్‌కుమార్

సిద్దిపేటకమాన్: రాష్ట్ర మంత్రి కొండా సురేఖను హైదరాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సతీశ్‌కుమార్ గురువారం కలిశారు. అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు గురించి ఆరా తీసినట్లు ఆయన తెలిపారు. భారత్ జోడో యాత్రలో రాహుల్ గాంధీతో కలిసి పాల్గొన్న చిత్రపటాన్ని మంత్రికి అందజేశామని చెప్పారు. కార్యక్రమంలో రాహుల్‌గౌడ్, రోహిత్, రాజేశ్, సురేశ్, సాయి, అశోక్ పాల్గొన్నారు.

జాబ్‌మేళాతో ప్రయోజనం

జహీరాబాద్: నిరుద్యోగ యువత జాబ్‌మేళాలను సద్వినియోగం చేసుకోవాలని డీఆర్డీఓ పీడీ జ్యోతి పేర్కొన్నారు. గురువారం జహీరాబాద్‌లో నిర్వహించిన జాబ్‌మేళాకు హాజరై మాట్లాడారు. తమ శాఖ ద్వారా జాబ్‌మేళాలను నిర్వహించి నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. జహీరాబాద్‌లో మహీంద్ర అండ్ మహీంద్రాలో ఉద్యోగాల కోసం జాబ్‌మేళా ఏర్పాటు చేశామన్నారు. 200 మందికి పైగా నిరుద్యోగ యువతీ యువకులు హాజరయ్యారు. కార్యక్రమంలో మేళా ఇన్‌చార్జి భవాని, ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న పీడీ జ్యోతి

క్లుప్తంగా

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న దృశ్యం

నిజాంపేట(మెదక్): నిజాంపేట మండల కేంద్రంలో గురువారం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన గెరిగంటి కుమార్ కుటుంబానికి గ్రామ యువకులు ఆర్థిక సాయం అందజేశారు. దాతల సహకారంతో రూ.65 వేలు, 25 కేజీల బియ్యాన్ని అందించారు. కార్యక్రమంలో జీపీస్వామి, గెరిగంటి బాబు, వడ్ల నాగరాజ్, పంజా బాబు, మాసుల నాగరాజు, జాల రవి, మ్యాదరి మధు, పవన్, షాదుల్, గడ్డం రాజు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కులగణన ప్రక్రియ



మడూర్‌లో సర్వే ప్రక్రియను పరిశీలిస్తున్న ఎంపీడీఓ దామోదర్

చిన్నశంకరంపేట(మెదక్): చిన్నశంకరంపేట, నార్సింగి మండల కేంద్రాలతో పాటు గ్రామాలలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కుటుంబ కులగణన సమగ్ర సర్వే ప్రక్రియ కొనసాగుతోంది. చిన్నశంకరంపేట మండలంలోని అంబాజిపేట, మడూర్, మిర్జాపల్లితండాలో ఎంపీడీఓ దామోదర్ సర్వే ప్రక్రియను పరిశీలించారు. నార్సింగి మండల కేంద్రంలో ఎంపీడీఓ ఆనంద్ సర్వేను పరిశీలించారు.

కొనుగోలు కేంద్రాల సందర్శన



నిజాంపేట మండల పరిధిలో కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన ఏఓ

నిజాంపేట(మెదక్): నిజాంపేట మండల పరిధిలోని పలు గ్రామాల్లో గురువారం మండల వ్యవసాయ అధికారి మద్దూరి సోమలింగారెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. అదేవిధంగా దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. మండల వ్యవసాయ అధికారితో పాటు వ్యవసాయ విస్తీర్ణ అధికారి రాజు రైతులు పాల్గొన్నారు.

ట్రిపుల్‌ఆర్ పనుల్లో నిర్లక్ష్యం

ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్: కాంగ్రెస్ అసమర్థ పాలన కారణంగానే రీజినల్ రింగు రోడ్డు(ట్రిపుల్‌ఆర్) పనుల్లో స్తబ్దత నెలకొన్నదని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి ఆరోపించారు. గురువారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విధానాలపై మండిపడ్డారు. తెలంగాణ అభివృద్ధిలో కీలకంగా మారనున్న ట్రిపుల్‌ఆర్‌పై నిర్లక్ష్యం వీడి పనులు ప్రారంభమయ్యేలా చొరవ చూపాలని డిమాండ్ చేశారు. పది నెలల కాంగ్రెస్ పాలనలో అన్ని రంగాలు కుదేలయ్యాయని వాపోయారు. ప్రత్యేకించి రియల్‌ఎస్టేట్ వ్యాపారం రోజురోజుకూ పతనమవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. రైతుల సంక్షేమానికి కృషి చేస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ రుణమాఫీ, రైతు బంధు అంశాల్లో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ఆరు గ్యారెంటీల అమలును ప్రభుత్వం పూర్తిగా మరిచిపోయిందని, ప్రజల మద్దతుతో కాంగ్రెస్ విధానాలపై పోరాటం చేస్తామని హెచ్చరించారు.

క్రీడలతో మానసికోల్లాసం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎస్ఐ

మర్కూక్(గజ్వేల్): క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడుతాయని ఎస్ఐ దామోదర్ అన్నారు. మండలంలోని ఎర్రవల్లిలో మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలోని క్రీడాలకారులు మంచి ప్రతిభను కనబర్చి జాతీయ స్థాయిలో రాణించేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ధనలక్ష్మి కృష్ణ, మండల స్పోర్ట్స్ క్లబ్ చైర్మన్ కృష్ణ పాల్గొన్నారు.